క్లుప్తంగా

వృద్ధాశ్రమ భవన నిర్మాణానికి విరాళం



వృద్ధాశ్రమానికి విరాళం అందజేస్తున్న పల్లి సుబ్బారావు దంపతులు

దేవరపల్లి: మండలంలోని గొల్లగూడెం వద్ద గల వృద్ధాశ్రమం భవన నిర్మాణానికి నల్లజర్ల సర్పంచ్ పల్లి జ్యోతి, సుబ్బారావు దంపతులు రూ.25 వేలు విరాళంగా అందజేసినట్టు ఆశ్రమం వ్యవస్థాపకుడు కాగిత భాస్కరరావు ఆదివారం తెలిపారు. ఆశ్రమంలో దివ్యాంగుల శాశ్వత వసతిగృహం, వృద్ధుల ఆశ్రమ భవన నిర్మాణం జరుగుతున్నట్టు చెప్పారు.

ఆసుపత్రిలో పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న రోటరీ సభ్యులు

నిడదవోలు: రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని 64 మంది బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ప్రవాస భారతీయుడైన సీహెచ్ శ్రీనివాస్ ఆర్థిక సహకారంతో వారీ సేవా కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, గోపిరెడ్డి శ్రీనివాస్, పొన్నా సుబ్రహ్మణ్యం, గొన్నాబత్తుల రామారావు, పోలదాసు శ్రీనివాసరావు, గుంటుపల్లి శివకుమార్, కాశ్ల రాంబాబు పాల్గొన్నారు.

27న కొవ్వూరు మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

కొవ్వూరు: స్థానిక మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని ఈనెల 27వ తేదీ ఉదయం 11.30 గంటలకు నిర్వహించనున్నట్టు చైర్‌పర్సన్ బావన రత్నకుమారి తెలిపారు. పట్టణంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులపై ఈ సమావేశంలో సమీక్షించనున్నట్లు తెలిపారు. కావున సభ్యులందరూ విధిగా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

పేద కుటుంబాలకు బియ్యం పంపిణీ

చాగల్లు: మల్లిపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని చిక్కాల, చిక్కాలపాలెం గ్రామాల్లోని 15 పేద కుటుబాలకు ఆదివారం 15 కేజీల చొప్పుల బియ్యాన్ని అందజేసినట్టు ట్రస్ట్ ప్రతినిధి మల్లిపూడి ధనరాజు తెలిపారు. పేదల కోసం ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కార్యక్రమంలో సర్పంచ్ కొయ్యే మణి అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు తిరుమలరావు, స్థానిక నాయకులు యెషయా, నూతంగి బాబూరావు, మడతల నాగేశ్వరరావు, శ్రీను, బాలకృష్ణ, పాలా వెంకటకృష్ణ, దుర్గ, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యాలయం ప్రారంభం

దేవరపల్లి: కొత్తగా దేవరపల్లిలో ఏర్పాటు చేసిన జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ కార్యాలయాన్ని ఆదివారం సాయంత్రం ఆ పార్టీ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు ప్రారంభించారు. పార్టీ పతాకాన్ని ఆ పార్టీ గోపాలపురం నియోకవర్గ ఇన్‌చార్జి డి.సువర్ణరాజుతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోవిందరావు మాట్లాడారు. సువర్ణరాజు నాయకత్వంలో నియోజకవర్గంలో జనసేన బలంగా ఎదిగిందన్నారు. సువర్ణరాజుకు పార్టీలో న్యాయం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ పోలవరం నియోజకవర్గం ఇన్‌చార్జ్ చెర్రి బాలరాజు, జిల్లా కార్యదర్శి జి.రవికుమార్, మండలశాఖ అధ్యక్షుడు కాట్నం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీపై కేసు నమోదు

కొవ్వూరు: స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన దంతులూరి సందీప్ అనే వ్యక్తికి చెందిన మోటార్ సైకిల్ చోరీకి గురైంది. దీనిపై అతడి నుంచి అందిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్టు పట్టణ పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ బాబురావు తెలిపారు. ఈ నెల 18వ తేదీ రాత్రి ఇంటి బయట తన మోటార్ సైకిల్‌ను పార్కింగ్ చేసినట్టు సందీప్ పేర్కొన్నాడు. మరునాటి ఉదయం లేచి చూసే సరికి మోటారు సైకిల్ చోరీకి గురైనట్లు గుర్తించానన్నారు. పలుచోట్ల వెతికినప్పటికీ కనిపించక పోవడం సందీప్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు హెచ్‌సీ బాబురావు తెలిపారు.

భగవద్గీత గ్రంథ ప్రచారం

కడియం: కడియపులంక గ్రామంలో త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక రాజమండ్రి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భగవద్గీత గ్రంథంలో అంశాలను ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక రాజమండ్రి కమిటీ అధ్యక్షుడు, సభ్యులు శేఖర్ బాబు, పీఎస్ఎన్ మూర్తి, లక్ష్మీనారాయణ, విజయ్, భరత్, రాణి, సంధ్యారాణి, సాత్విక్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

శాంతి మార్గం.. క్రీస్తు సందేశం

- నేటి క్రిస్మస్ వేడుకలకు పూర్తయిన ఏర్పాట్లు
- విద్యుత్తు వెలుగులతో కాంతులీనుతున్న క్రైస్తవ మందిరాలు

నిడదవోలు: శాంతికి, త్యాగానికి ప్రతీక క్రిస్మస్. విశ్వాసం, ప్రేమ, కరుణ, దయ, నిరీక్షణ సందేశంతో క్రీస్తు లోకానికి కొత్త మార్గాన్ని చూపారు. సోమవారం నాటి క్రిస్మస్ వేడుకలకు నియోజకవర్గంలోని చర్చిలను ప్రత్యేకంగా అలంకరించారు. నిడదవోలు పట్టణంతో పాటు నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లో చర్చిలు క్రిస్మస్ కాంతులతో కళకళలాడుతున్నాయి. పట్టణంలోని వివిధ చర్చిల వద్ద, ప్రధాన సెంటర్లలో అలంకరించిన విద్యుత్తు దీపాలు రాత్రి వేళ కాంతులీనుతూ కనువిందు చేస్తున్నాయి. అలాగే క్రైస్తవుల గృహాలు రంగురంగుల విద్యుత్తు వెలుగులతో మెరిసిపోతున్నాయి. ఏసుక్రీస్తు పుట్టిన రోజుకు భారీ ఏర్పాట్లు చేశారు.



విద్యుత్తు కాంతులతో నిడదవోలు కృపాధార లూథరన్ చర్చి



నిడదవోలులోని మెంటే సుందరరావు మెమోరియల్ లూథరన్ టౌన్ చర్చి

● జోరుగా సాగిన విక్రయాలు

ఇప్పటికే సెమీ క్రిస్మస్ వేడుకలు జరుగుతున్నాయి. పట్టణంలోని వివిధ షాపుల్లో వివిధ రకాల లైటింగ్ స్టార్స్, క్రిస్మస్ ట్రీలు, శాంతాక్లాజ్, మూవింగ్ డాల్స్, బెల్స్, హ్యాపీ క్రిస్మస్ స్టిక్కర్స్‌తో పాటు వివిధ రకాల బహుమతుల విక్రయాలు జోరుగా సాగాయి. ఇప్పటికే వివిధ రకాలు క్రిస్మస్ కేక్‌లను ఆర్డర్ చేశారు. సాధారణ కేక్ కేజీ రూ.300 కాగా కూల్ కేక్ కేజీ రూ.650 కు వ్యాపారులు విక్రయిస్తున్నారు.

మానవాళికి శాంతిని ఇచ్చేదే క్రిస్మస్



సమాజంలో బాధ నుంచి భక్తిని బాధ్యతను నేర్పించి, ప్రపంచ శాంతిని, సౌభాగ్యాన్ని అనుగ్రహించే రోజు క్రిస్మస్ పర్వదినం. క్రైస్తవ విశ్వాసులు దేవునిపై పరిపూర్ణ భయ భక్తులతో ఆయనకు ఇష్టులుగా జీవించి శాంతి సమాధానాలు పొందడమే నిజమైన క్రిస్మస్ ఆరాధన.

– రెవరెండ్, ఫాదర్ బత్తుల జయరాజు, హెరాల్ప్ ఆఫ్ గుడ్ న్యూస్ ప్రావెన్షియల్ సుపీరియర్, నిడదవోలు

దేవునికి ఇష్టులుగా జీవించడమే..



దేవునికి ఇష్టులుగా జీవించడమే నిజమైన క్రిస్మస్. ఏసు ప్రభువు జన్మ సమయంలో పరలోక దూతలు సర్వోన్నతమైన స్థలాల్లో దేవుని మహిమయు, ఆయనకు ఇష్టులైన మనుషులకు భూమి మీద సమాధానం కలుగును గాక అని స్తుతి గానాలు చేశారు. క్రిస్మస్ అంటే క్రీస్తును ఆరాధించుట. క్రీస్తు పుట్టుకలో దేవదూతలు, జ్ఞానులు, గొర్రెల కాపరులు క్రీస్తుని ఆరాధించి పూజించారు.

– మెంటే దయరాజగిరి, చైర్‌పర్సన్, మెంటే సుందరరావు మెమోరియల్ లూథరన్ టౌన్ చర్చి, నిడదవోలు

ఆత్మ, సత్యంతో ఆరాధించడమే నిజమైన క్రిస్మస్



క్రిస్మస్ పర్వదినం సర్వమానవాళికి పర్వదినం. సమస్త మానవుల నిత్య జీవ ప్రాప్తికి మంచి మార్గం. క్రీస్తు జననం నిజమైన క్రైస్తవత్వం, ప్రేమతత్వాన్ని ప్రబోధించింది. ఈ పండుగ ఆర్భాటం కాదు కాని క్రైస్తవ విశ్వాసం. సౌఖ్యం, ప్రేమ, ఐక్యత, ప్రార్థనా శక్తిని వృద్ధి చేసే మంచి తరుణం. క్రిస్మస్ ఆరాధన అంటే క్రీస్తు మాదిరి నడుచుకోవడం, క్రీస్తు మాదిరి జీవించడం – రెవరెండ్ పాస్టర్ బెందుకుర్తి అరుణ్‌కుమార్, లూథరన్ చర్చి, సమిశ్రగూడెం

మొదలైన క్రిస్మస్ సందడి



వేగేశ్వరపురంలోని గోదావరి ఒడ్డునే గల మేరీమాత ఆలయం

తాళ్లపూడి: గ్రామాల్లో క్రిస్మస్ సందడి మొదలైంది. క్రైస్తవ ఆరాధకులు ఇప్పటికే తమ ఇళ్ల వద్ద క్రిస్మస్ స్టార్లు ఏర్పాటు చేశారు. అలాగే వివిధ గ్రామాల్లోని చర్చిలను రంగు రంగుల విద్యుత్తు లైట్లతో శోభాయమానంగా అలంకరించారు. సుమారు 170 ఏళ్ల చరిత్ర కలిగిన వేగేశ్వరపురంలోని లూథరన్ చర్చి సోమవారం నాటి క్రిస్మస్ వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. సోమవారం ఉదయం ఆరు గంటల నుంచి చర్చిలో ఆరాధన, క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. చర్చిని విద్యుత్ లైట్లతో అలంకరించారు. పెద్ద స్టార్ ఏర్పాటు చేశారు. అలాగే ఇదే గ్రామంలో ఆహ్లాదకర వాతావరణంలో గోదావరి ఒడ్డున గల మరో క్రైస్తవ ప్రార్థనా మందిరం గోదావరి మేరీమాత ఆలయం. క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్టు ఫాదర్ జి.డేవిడ్ తెలిపారు. ఇక్కడి మేరీమాత ఆలయం అతి తక్కువ కాలంలోనే ప్రసిద్ధి చెందింది. క్రిస్మస్ సందర్భంగా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. అలాగే మండలంలోని ప్రక్కిలంక, పైడిమెట్ట, మలకపల్లి, తాళ్లపూడి, అన్నదేవరపేట గ్రామాల్లోని చర్చిల్లో ఆదివారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని చర్చిల వద్ద, గృహాలపైన క్రిస్మస్ స్టార్లను ఏర్పాటు చేశారు.

ఉండ్రాజవరం మండలంలో..



విద్యుత్తు దీపాలతో వెలుగొందుతున్న ఉండ్రాజవరంలోని క్రీస్తు లూథరన్ చర్చిన

ఉండ్రాజవరం: ఏసుక్రీస్తు పుట్టిన రోజైన క్రిస్మస్ పండగను స్వాగతిస్తూ క్రైస్తవులు సందడి చేస్తున్నారు. ఈనెల 25న తమ ఆరాధ్య దైవం క్రీస్తు జన్మదినం సందర్భంగా ఇళ్లల్లో, చర్చిల్లో జోరుగా ఏర్పాటు చేశారు. కిస్మస్ వేడుకలకు మండలంలోని క్రీస్తు లూథరన్ చర్చి, బైబిల్ మిషన్, జీడీఎం, క్యాథలిక్, జీడీఎం, సీజీఎం, ఐబీఎం షారోను చర్చిల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పుటికే ఈనెల 1 నుంచి ఆయా చర్చిలలో ప్రత్యేక ప్రదర్శనలు, క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నారు.



వేగేశ్వరపురంలో 170 ఏళ్ల చరిత్ర గల లూథరన్ చర్చి

అగ్ని ప్రమాద బాధితులకు గ్యాస్ కనెక్షన్లు

నల్లజర్ల: ఇటీవల నల్లజర్లలో సంభవించిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన ఆరు కుటుంబాల వారికి ఆదివారం గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు గ్యాస్ కనెక్షన్‌లు, మంచాలు, బియ్యం, దుస్తులు అందజేశారు. నల్లజర్ల హెచ్‌పీ గ్యాస్ డీలర్ బొమ్మిరెడ్డి పల్లి రవికుమార్ అందించిన రూ.36 వేల ఆర్థిక సాయంతో ఆ కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్‌లు సమకూర్చారు. నల్లజర్ల సర్పంచ్ పల్లి జ్యోతి, సుబ్బారావు దంపతులు ఈ ఆరు కుటుంబాలకు మంచాలు, దుస్తులు సమకూర్చారు. నల్లజర్ల యూత్ అధ్యక్షుడు మేణ్ని యువరాజు ఒక్కో కుటుంబానికి 45 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌పీ గ్యాస్ ఏరియా మేనేజరు ఎం ఎల్ఎస్ మూర్తి, కారుమంచి రమేష్, మద్దిపాటి ప్రసాద్, సర్పంచ్ పల్లిజ్యోతి, ఉప సర్పంచ్ రాయుడు విజయకుమార్, ఎంపీటీసీ సభ్యురాలు మేణ్ని వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ అరుగొల్లు మణి తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు గ్యాస్ కనెక్షన్‌లు, నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

రామారావు కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

నిడదవోలు రూరల్: రెండు రోజల క్రితం మృతి చెందిన మండలంలోని ఉనకరమిల్లికి చెందిన పోలిరెడ్డి నాగసత్య వెంకట రామారావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ఆదివారం పరామర్శించారు. రామారావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే కోరుమామిడి గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తూ మరణించిన వైఎస్సార్ సీపీ కార్యకర్త ప్రతిపాటి రాజా కుటుంబ సభ్యులను కూడా ఎమ్మెల్యే పరామర్శించారు. సర్పంచులు పోలిరెడ్డి భారతీలక్ష్మి, అంబటి గోపమ్మ, సొసైటీ అధ్యక్షులు వింతా గంగాధర్‌రెడ్డి, యాళ్ల రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పోలిరెడ్డి శివరామకృష్ణ, కె.భాస్కరరావు, అనుమోలు శివ, కానుబోయిన శేషు తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.



నాగసత్య వెంకట రామారావు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

రాజేశ్వరీ రామకృష్ణన్ సేవలు చిరస్మరణీయం

నిడదవోలు: డిగ్రీ కళాశాల ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించడమే కాకుండా నిర్మాణానికి ధన సహాయం చేసిన రాజేశ్వరీ రామకృష్ణన్ సేవలు చిరస్మరణీయమని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి అన్నారు. పట్టణంలోని ఎస్వీ ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజేశ్వరి రామకృష్ణన్ మృతిపై సంతాప సభ నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఆమె మృతికి స్థానిక రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యశాలలో శనివారం సంతాప తెలిపారు. రాజేశ్వరీ రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యశాలను నిర్మించి అనేక మంది పేదలకు వైద్య సేవలు అందించడానికి కారణమైన ముఖ్య దాత అని పలువురు కొనియాడారు. కంటి హాస్పిటల్ కార్యదర్శి లయన్ పి.సురేంద్రకుమార్, ట్రస్ట్ బోర్డు సభ్యుడు నడుపల్లి ఆంజనేయులు, మేనేజర్ సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

దేవరపల్లి: మెట్ట ప్రాంతంలో విద్యాభివృద్ధికి పారిశ్రామిక వేత్త వెలగపూడి రాజేశ్వరీ రామకృష్ణన్ విశేష కృషి చేశారని దేవరపల్లి సహకార జూనియర్ కళాశాల చైర్మన్ కేశిరాజు కాశీ విశ్వనాథం, కరస్పాండెంట్ యాగంటి సాయిబాబు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం కళాశాలలో రాజేశ్వరీ రామకృష్ణన్ సంతాపసభ నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో విద్యాసంస్థలకు ఎంతో ఆర్థిక చేయూత నిచ్చి భవనాల నిర్మాణం, మౌలిక సదుపాయాలకు ఆర్థికసాయం అందజేసినట్టు సాయిబాబు తెలిపారు. కార్యక్రమంలో దేశెట్టి బాబిహరిప్రసాద్, బ్రహ్మానందం, పార్వతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

31న బాల బాలికల అథ్లెటిక్ మీట్

ప్రకాశం నగర్: నిడ్జామ్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ ఈ నెల 31వ తేదీన ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో అండర్-14, 16 బాల బాలికల విభాగంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు అథ్లెటిక్స్ మీట్ పోస్టర్‌ను ఆదివారం స్థానిక వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ చీఫ్, రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ 2023–2024 బాల బాలికల అథ్లెటిక్స్ మీట్ విజయవంతం చేసేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాల్సిందిగా కోరారు. నిడ్జామ్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ అధ్యక్ష కార్యదర్శులు ఆర్ రాజేంద్రప్రసాద్, నల్లజర్ల శివకుమార్ మాట్లాడుతూ ఈ నెల 31న నిర్వహించే జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ సెలక్షన్స్‌కు రాజమండ్రి ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా ఆహ్వానించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమం నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ కోచ్‌గా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ నుంచి ఎంపికైన జి.ప్రసాద్ ఆధ్వర్యంలో కొనసాగుతాయని తెలిపారు.

ఆంజనేయస్వామి ఉత్సవాలు ప్రారంభం

తాళ్లపూడి: ఆంజనేయ స్వామి ఉత్సవాలు ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి ఆలయాలకు హాజరై పూజలు చేశారు. ప్రక్కిలంకలోని భక్తాంజనేయస్వామి ఆలయ 20వ వార్షికోత్సవాల సందర్భంగా అర్చకుడు పెద్దింటి శ్యామ్ ఆధ్వర్యంలో స్వామివారికి నవరసాభిషేకాలు, పుష్పాలతో విశేష పూజ నిర్వహించారు. వేగేశ్వరపురంలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద అర్చకుడు పెరవలి సాయి ఆధ్వర్యంలో తమలపాకులు, సిందూరంతో పూజలు చేశారు. అలాగే తాళ్లపూడి, తాడిపూడి, అన్నదేవరపేట, మలకపల్లి, రావూరుపాడు, పెద్దేవం, తిరుగుడుమెట్ట, గజ్జరం, రాగోలపల్లి తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామి ఉత్సవాలు నిర్వహించారు.



వేగేశ్వరపురంలో అభయాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

ఉమా చోడేశ్వరస్వామికి రుద్రహోమం



ఉమా చోడేశ్వర స్వామికి బిల్వార్చన చేస్తున్న అర్చకులు

కొవ్వూరు: స్థానిక పాతూరులోని ఉమా చోడేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం గణపతి పూజ, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, అమ్మవార్లకు శ్రీసూక్త విధానంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి బిల్వార్చన, రుద్రహోమం చేశారు. పట్టణానికి చెందిన తిప్పాభొట్ల సుబ్రహ్మణ్య శాస్త్రి, పద్మశ్రీ దంపతుల చేతుల మీదుగా పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు దేవరకొండ సాయి ప్రసాద్, ప్రవ బాల నాగేంద్ర ప్రసాద్, ప్రవ సత్యనారాయణ, బందా వెంకటేశ్వరరావు, దామరాజు సచ్చిదానంద, వైవీ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెంలో ఆటో ఢీకొని తండ్రీ కూతుళ్లకు గాయాలయ్యాయి. సమిశ్రగూడేనికే చెందిన షేక్ అమీర్ భాషా, అతడి కుమార్తె అహ్మదున్నీషాలు ఆదివారం సాయంత్రం బైక్‌పై నిడదవోలు నుంచి ఇంటి వస్తుండగా వంతెన సమీపంలో ఆటో వారిని ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన ఇద్దరిని అత్యవసర వైద్యసేవలందించేందుకు రాజమహేంద్రవరం తరలించారు.

కట్నం కోసం వేధిస్తున్న నలుగురిపై కేసు

నిడదవోలు రూరల్: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఏఎస్సై పరమహంస ఆదివారం తెలిపారు. మండలంలోని కోరుమామిడి గ్రామానికి చెందిన చెప్పుల సత్యవతికి, నల్లజర్ల మండలం చోడవరం గ్రామానికి చెందిన లక్ష్మణరావుతో పదేళ్ల క్రితం వివాహమైంది. ఇటీవల తన భర్త లక్ష్మణరావుతో పాటు అతని కుటుంబ సభ్యులు కట్నం కోసం తనను వేధిస్తున్నారంటూ సత్యవతి సమిశ్రగూడెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై ఆమె అత్తింటి వారు నలుగురుపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నాటి డెకాయిట్ ఇప్పుడు అవసరం అయ్యారా?



విలేకరులతో చీకటిమిల్లి మంగరాజు

నల్లజర్ల: 'ఆయన పీకే కాదు.. బీహార్ డెకాయిట్' అంటూ లోగడ ప్రశాంత్ కిశోర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ అధినేతలు చంద్రబాబు, లోకేష్‌లకు ఇపుడు ఆ పీకేనే అవసరమయ్యాడా? అని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు ఎద్దేవా చేశారు. నల్లజర్లలో ఆదివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. పీకే బీహార్‌లో మత కల్లోలాలు సృష్టించారని, హత్యలు చేయించారని అప్పట్లో చంద్రబాబు అన్నారని మంగరాజు గుర్తు చేశారు. చంద్రబాబు, లోకేష్‌లు ఎంతకు దిగజారతారో, అవసరమైతే కాళ్లు పట్టుకుంటారో అనడానికి ప్రశాంత్ కిశోర్ విషయమే ఒక ఉదాహరణ అన్నారు. సమావేశంలో నాయకులు సీహెచ్ భరత్, పి.బాలకృష్ణ పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు

నిడదవోలు రూరల్: ఇరువురి మధ్య ఘర్షణ చోటుచేసుకుని ఇనుప రాడ్డుతో దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ శనివారం తెలిపారు. మండలంలోని సమిశ్రగూడెం గ్రామానికి చెందిన ఎల్లే సత్తిబాబుకు అదే గ్రామానికి చెందిన మురాల రవికాంత్ మధ్య ఈనెల 22వ తేదీ రాత్రి మాటామాటా పెరిగి వివాదం ఏర్పడిందన్నారు. దీంతో రవికాంత్ ఇనుప రాడ్డుతో సత్తిబాబుపై దాడి చేశాడు. కంటి వద్ద గాయమైన సత్తిబాబు నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. బాధితుడు సత్తిబాబు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

గోదావరిలో మృతదేహం లభ్యం

కొవ్వూరు: పట్టణంలో రోడ్డు కం రైలు బ్రిడ్జికి సమీపంలో గోదావరి నదిలో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతుడి వయస్సు సుమారు 60 ఏళ్లు ఉండవచ్చని పట్టణ పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని వెలికి తీసి ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. వివరాల కోసం పట్టణ పోలీసులను సంప్రదించాలని పట్టణ ఎస్సై బి.దుర్గా ప్రసాద్ తెలిపారు.